క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహాలక్ష్మీ, గోదాదేవి అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు మాట్లాడుతూ గురువారం బ్రహ్మోత్సవాలు ముగింపు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైతులకు స్థలం కేటాయించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): పండించిన పంటను ఆరబోసేందుకు కల్లం, భద్రపరేచేందుకు గోదాం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీలో పరిధిలోని సర్వే నంబర్ 109లోని ప్రభుత్వ స్థలంలో పంటను ఆరబోసేందుకు కల్లాల ఏర్పాటుకు 10 ఎకరాలు, కోల్డ్ స్టోరేజీకి 5 ఎకరాల స్థలం కేటాయించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని సైతం కలిసి విన్నవించారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ బాల్‌రెడ్డి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న 'తాళం'


తెరుచుకున్న తహసీల్దార్ కార్యాలయం తాళం

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ తహసీల్దార్ కార్యాలయం తాళం ఎట్టకేలకు బుధవారం తెరుచుకుంది. కార్యాలయం ప్రైవేట్ భవనంలో కొనసాగుతుంది. అద్దె డబ్బులు చెల్లించడం లేదని భవనం యాజమాని నర్సమ్మ ఈ నెల 6న తాళం వేసిన విషయం విదితమే. బుధవారం ఉదయం కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు వచ్చిన అధికారులు తాళం తెరవకపోవడంతో బయటే నిల్చున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. త్వరగా అద్దె డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో కార్యాలయానికి తాళం తీశారు.

విశిష్ట గుర్తింపు తప్పనిసరి

నారాయణఖేడ్ ఏడీఓ నూతన్‌కుమార్


కార్డుల నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు రైతులకు విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరి అని నారాయణఖేడ్ ఏడీఓ నూతన్‌కుమార్ అన్నారు. బుధవారం ముకుందతండా, తడ్కల్ గ్రామాల్లో ఏఈఓలు స్వాతి, హన్మండ్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో దండోరా వేయించి గుర్తింపు ప్రక్రియ నెల రోజుల్లో పూర్తయ్యేటట్లు రైతులు, వ్యవసాయాధికారులు సహకరించాలని కోరారు.

92వ రోజుకు చేరిన నిరసన


నల్లవల్లిలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంప్‌యార్డ్ ఏర్పాటుకు జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 92వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి, ప్యారానగర్ ప్రాంతాల్లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం నల్లవల్లి దీక్షా శిబిరంలో స్థానిక మహిళలు పాల్గొని డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డంప్‌యార్డ్ నిర్మాణ పనులు నిలిపివేసే వరకు తమ నిరసనలు కొనసాగిస్తామన్నారు.

చీడపీడలకు వేపమందుతో చెక్

- తక్కువ ఖర్చు అధిక ప్రయోజనం
- వేప గింజల సేకరణకు మే జూన్ నెలలు
- హత్నూర మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్


శ్రీనివాస్ మండల వ్యవసాయ శాఖ అధికారి

హత్నూర(సంగారెడ్డి): వ్యవసాయ పంటలలో వేప ఎరువు ఎంతో విశిష్టత కలిగి ఉందని హత్నూర మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. వేప మందుతో చీడపీడల నివారణపై 'సాక్షి' ప్రత్యేక కథనం. రైతులు రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు, వేప మందును వాడితే ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ వివరించారు. ఇంకా ఆయన మాటల్లో వేపలో ఉండే అజాడి రెక్టిన్ అనే పదార్థం వికర్షణగా పనిచేస్తుంది. దీని ఘాటైన వాసన చేదు పైరును ఆశించడానికి పురుగులు ఇష్టపడవు. పురుగులు ఆహారాన్ని తినడానికి విముఖత చూపుతాయి. సంతాన ఉత్పత్తి కోల్పోయి గుడ్లు పెట్టే శక్తి తగ్గిపోతుంది. పురుగు అన్ని జీవిత దశలపై దీని ప్రభావం ఉంటుంది. వేప రసాయనాల వల్ల పురుగు సహజ శత్రువులకు ఎలాంటి హాని కలగదు. వేప ఉత్పత్తులు పురుగులను నేరుగా చంపకపోయినా వాటి నియంత్రణకు మాత్రం తోడ్పడుతాయి.

వేప ఉత్పత్తులు....

వేప గింజ నుంచి తీసిన తైలం పర్యావరణ మిత్ర జీవ సస్యరక్షణ మందుగా ఉంటే కీటక నాశనిగా, శిలీంద్ర నాశనిగా ఉపయోగపడుతుంది. ముందుగా నీటిలో 200 గ్రాముల సబ్బు పొడి వేసి బాగా


వేప పండ్లు

గిలక కొట్టి నురుగు వచ్చిన తర్వాత వేప నూనె కలపాలి. ఇది మొక్కలపై పిచికారీ చేయడం వల్ల కాయతొలుచు పురుగు, రసం పీల్చు పురుగు, ఆకు తినే పురుగులను నివారించవచ్చు.

వేప పిండి...

వేప గింజల నుంచి నూనె తీయగా మిగిలిన పిప్పిని వేపపిండి లేదా చెక్క అంటారు. వేప పిండి లో 5.2%నత్రజని, 1.1% భాస్వరం 1.1% పొటాషియం ఉంటాయి. వేప పిండిని ఎకరాకు ఒకటి నుంచి రెండు క్వింటాళ్ల వరకు వేయవచ్చు. భూమిలో హాని చేసే పురుగుల నిర్మూలనకు వేప పిండి బాగా పనిచేస్తుంది. దుక్కి దున్నే సమయంలో దీన్ని సాల్లాల్లో వేయవచ్చు. నారుమడిలో విత్తనాలు జల్లే ముందు వేప పిండి వేస్తే కూడా చాలా ప్రయోజనం ఉంటుంది.

వేప ద్రవం...

నీడలో బాగా ఎండిన 5 కేజీల వేప గింజలను మెత్తగా రుబ్బి పిండి చేయాలి. దీనిని ఒక మూటలో కట్టి 10 లీటర్ల నీటిలో10-12 గంటలు నానబెట్టాలి. తర్వాత నీటిలో మూటను ముంచి పట్టుకుని1 నిమిషాలు కషాయాన్ని పిండాలి. ఈ ద్రవాన్ని పలుచని గుడ్డలో వడపోయాలి. వడపోసిన ద్రవానికి 100 గ్రాముల సబ్బు పొడిని కలపాలి. ఈ వేప కషాయాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరం పొలంలో సాయంత్రం సమయంలో పంటపై పిచికారీ చేసుకోవాలి. నిల్వ ఉంచరాదు వేప ద్రవాన్ని అన్ని పంటల్లోనూ నారుమడిలో ను పండ్ల తోటలకు వాడుకోవచ్చు.

వేప గింజల సేకరణలో జాగ్రత్తలు..

- వేప చెట్టు నుండి పడిన పండ్లను మాత్రమే సేకరించాలి.
- మే, జూన్ నెలలో పండ్ల సేకరణకు సరైన సమయం.
- సేకరించిన పండ్లను బాగా శుభ్రం చేసి నీడలో ఆరబెట్టాలి.
- నీడలో ఆరబెట్టిన వేప పండ్ల నుంచి ఎప్పటికప్పుడు గింజలను వేరు చేసుకోవాలి.
- దానికోసం పండ్లను నీళ్ల తొట్టిలో వేసి రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు పండ్లను గింజలను వేరు చేయాలి.
- వేప గింజలను ఏడాది కంటే ఎక్కువ నిల్వ చేయరాదు.
- వేప గింజలను ఎండలో పెట్టవద్దు.
- వేప గింజలను పాలిథిన్ సంచిలో నిల్వ చేయవద్దు.

భరోసా సేవలు దేశానికి ఆదర్శం

ఎస్పీ పరితోశ్ పంకజ్


ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ పరితోశ్ పంకజ్, తదితరులు

సంగారెడ్డి జోన్: పోక్సో, అత్యాచార కేసులలో బాధిత మహిళలు, బాలికలకు అండగా ఉంటున్న భరోసా కేంద్రం సేవలు దేశానికే ఆదర్శం అని ఎస్పీ పరితోశ్ పంకజ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. భరోసా కేంద్రం 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డి భరోసా కేంద్రంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల సేవలను ఒకే కేంద్రం ద్వారా అందించాలన్న సంకల్పంతో తెలంగాణవ్యాప్తంగా భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బాధితులకు న్యాయం అందించడంలో అలసత్వం చూపవద్దని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ప్రమీల, ఎస్ఐ పూలబాయి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకంలో కూలీలకు గరిష్టంగా చెల్లించాల్సిన వేతనాలకు తగినట్లు కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. మండలంలోని గాజుల్‌పాడ్ శివారులో ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన బలిరాం అనే రైతు పంట పొలంలో గులకరాళ్ల కట్టలు వేశాడని ఏపీఓ నర్సింలు తెలిపారు. 250 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు తెలిపారు. కూలీలకు గరిష్ట వేతనం రూ.307 పొందేటట్లు నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు.

శంకుస్థాపన

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని బండ్లగూడ ముదిరాజ్ శ్మశాన వాటికలో స్నానపు గదుల నిర్మాణానికి బుధవారం కార్పొరేటర్ మెట్టు కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత నిధులతో స్నానపు గదులు ఏర్పాటు చేయిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో బండ్లగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు భరత్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, స్థానికులు సత్తయ్య, అర్జున్, జగదీష్, శ్రీరాములు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గణితంలో పీహెచ్‌డీ

పటాన్‌చెరు: మండల పరిధిలోని రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని సీహెచ్. మంగమ్మ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. ×నిలువు పోరస్ ప్లేట్ అంతటా మాగ్నెటో హైడ్రోడైనమిక్ ద్రవ ప్రవాహం యొక్క వేడి, ద్రవ్యరాశి బదిలీ ప్రభావం× అనే అంశంపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాల సిద్దులు మల్ల బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు.

ప్రధాని మోదీకి అండగా నిలవాలి


మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

- ఆపరేషన్ సిందూర్ విజయవంతం అభినందనీయం
- ఎంపీ రఘునందన్‌రావు

సదాశివపేట(సంగారెడ్డి): దేశాన్ని పట్టిపీడిస్తున్న తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి దేశ ప్రధాని మోదీకి దేశ ప్రజలందరూ ఐక్యంగా, అండగా నిలవాలని ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్యుల కులదేవత వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను బుధవారం ఘనం నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ...పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో జరిపిన మెరుపుదాడితో ఉగ్రవాదులు మృతి చెందడం భారత దేశంలో ప్రజలందరు సంబరాలు చేసుకున్నారన్నారు. 50 ఏళ్ల తర్వాత దేశవ్యాప్తంగా యుద్ధ సన్నద్ధతపై ప్రముఖ పట్టణాల్లో మాక్ డ్రిల్ నిర్వహించి సంక్షోభ సమయంలో ప్రజలు ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేశ్వర్‌రావుదేశ్‌పాండే, మాణిక్‌రావు, రాజేశ్వరి, శ్రీశైలంయాదవ్, కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కందికృష్ణ,శరత్, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్‌పాటిల్, కసాల బుచ్చిరెడ్డి, చింతగోపాల్, అంజయ్య ఆర్యవైశ్యులు ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రికార్డుల పరిశీలన

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల డ్వాక్రా గ్రూపు సంఘాలకు చెందిన సంఘం సభ్యులు బ్యాంకులో తీసుకున్న రుణాలు ఎప్పటికప్పుడూ చెల్లిస్తున్నది లేనిది సోషల్ అడిట్ గంగాధర్ రికార్డులను పరిశీలించారు. బుధవారం మండల కేంద్రమైన ఐకేపీ కార్యాలయంలో 2023-25కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో (ఏపీఎం) అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ మక్తసారం భాగయ్య, (సీసీ) కమ్యూనిటీ కో ఆర్డినేటర్ శివయ్య, ప్రభు, మోహన్, నాగమణితోపాటు తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

రాయికోడ్(అందోల్): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని రాయికోడ్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ కోరారు. బుధవారం రాయికోడ్‌లో ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. ప్రభుత్వ బడుల్లో చేరిన పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులను అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ మోహన్, ఉపాధ్యాయుడు జనార్ధన్ పాల్గొన్నారు.

◆ క్రీడాకారులకు టీ షర్ట్‌ల పంపిణీ

మునిపల్లి(అందోల్): మండలంలోని పెద్దగోపులారం గ్రామంలో కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లకు బుధవారం రత్నం స్వేరో టీ షర్ట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజు, ఆంజనేయులు, ప్రసాద్, మనోజ్, డేవిడ్, సాయి, పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

◆ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

మునిపల్లి(అందోల్): ఆదర్శ కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లిక బుధవారం తెలిపారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఈసీలో ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశాలకు దరఖాస్తు ఉచితమని తెలిపారు.

◆ ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని విశ్వకర్మ ఆలయంలో బుధవారం శ్రీ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి 332 ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వకర్మ సంఘం నాయకులు కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, మయబ్రహ్మచారి, రాజ్ కుమార్, పాండుచారి, దేవేందర్ చారి పాల్గొన్నారు.

◆ ఆక్రమణలను అడ్డుకోండి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని సీతారామపురం కాలనీలో పబ్లిక్ రోడ్డును ప్లాట్లుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ కోరారు. ఈ ఈ మేరకు బుధవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.


◆ సమస్యలను పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బుధవారం సీపీఎం నాయకులు సందర్శించారు. అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ మాట్లాడుతూ.. ఇక్కడ నివాసం ఉంటున్న నిరుపేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తాగునీరు సరిగా రావడం లేదని తెలిపారు. నిర్మాణం సరిగా లేక ప్రతి నెల చందాలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పేదల సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు వాజిద్ అలీ, నర్సింహులు, నాగేశ్వరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ సమ్మెను జయప్రదం చేయాలి

జిన్నారం(పటాన్‌చెరు): ఈనెల 20 తేదీన జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బొల్లారం పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు నోటీసులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణమే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికుల సమస్యలు, ధరలు తగ్గించి ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలన్నారు. పరిశ్రమలన్ని స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేందర్‌రెడ్డి, అర్జున్ పాల్గొన్నారు.

◆ రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడిగా శంకర్ పాటిల్



జహీరాబాద్ టౌన్: రాష్ట్రీయ బసవదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా జహీరాబాద్‌కు చెందిన శంకర్‌పాటిల్‌ను కర్నాటకలోని బసవధర్మ పీఠ అధ్యక్షురాలు డాక్టర్ గంగామాతాజీ నియమించారు. శంకర్ పాటిల్ ఎన్నికకావడం ఇది రెండో సారి. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా జహీరాబాద్ కార్యకర్త సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.

మొక్కల పెంపకం వేగవంతం చేయండి

ఎంపీడీఓ సత్తయ్య


కంగ్టి: హోబా తండాలో వన నర్సరీలో కలుపు మొక్కలు తొలగిస్తున్న ఎంపీడీఓ సత్తయ్య

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోని వన నర్సరీల్లో మొక్కల పెంపకం వేగవంతం చేయాలని ఎంపీడీఓ సత్తయ్య ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభానికి నెల రోజులు మాత్రమే ఉన్నందున ప్రారంభంలోనే మొక్కలు పంపిణీకి సిద్ధం చేయాలని సూచించారు. బుధవారం హోబా తండా గ్రామపంచాయతీకి చెందిన వన నర్సరీలో పెంచుతున్న మొక్కలను ఆయన పరిశీలించారు. ప్యాకిట్లలో కలుపు మొక్కలు లేకుండా చూడాలని తెలిపారు. కొన్ని ప్యాకిట్లలోని కలుపు మొక్కలు తొలగించారు. మొక్కలు ఏపుగా ఎదిగేట్లు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు మొక్కల పెంపకం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


వెంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న నగేష్ షెట్కార్ తదితరులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం ఆకుల లింగాపూర్ గ్రామంలో బుధవారం వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామికి శ్రీదేవి, భూదేవిలతో వేద బ్రాహ్మణులు మంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవంతో పాటు సాయంత్రం బండ్ల ప్రదర్శన, లాజ హోమం, రాత్రి రేణుక ఎల్లమ్మ వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి సిద్దేశ్వర్ మహారాజ్, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్, మాజీ ఎమ్మెల్యేలు విజయపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, పీసీసీ సభ్యులు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ సతీష్, రాధాక్రిష్ణ, జెట్ల భాస్కర్, మాణిక్యం, సాంబయ్యగారి వెంకటేశం, నర్సింలు, ఈశ్వరప్ప పటేల్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు. గురువారం లాజ హోమం, పాచిబండ్ల ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జెట్ల భాస్కర్ తెలిపారు.

అధిక లోడ్‌తో వాహనాలు నడిపిస్తే కేసులు

పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి


మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు: అధిక లోడ్‌తో వాహనాలు నడిపిస్తే కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని లక్డారంలో పోలీసు, రవాణ శాఖ ఆధ్వర్యంలో క్రషర్లలో నడిపే టిప్పర్ల వాహన డ్రైవర్లతో రహదారి భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అధిక లోడ్ వాహనాలు కనిపిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. రోడ్డు ప్రమాదం జరిగితే డ్రైవర్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం ఎంవీఐ విజయరావు మాట్లాడుతూ.. వాహన డ్రైవర్లు తప్పకుండా తమ వెంట వాహనానికి సంబంధించిన వాహనపత్రాలు జిరాక్స్ కాపీ వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి, ఎస్ఐ వెంకట్ రెడ్డి, మహేశ్, డ్రైవర్లు, వాహన యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి బోరు మోటారు వితరణ


బోరు మోటారు ప్రారంభిస్తున్న అర్చకులు మోహన్‌జోషి, వీరయ్య

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి రూ.70 వేల విలువ చేసే బోరు మోటారు, ఇతర సామాగ్రిని పట్టణానికి చెందిన రిటైర్డ్ హాస్టల్ వెల్ఫేర్ అధికారి త్యార్ల వీరయ్య కుటుంబ సభ్యులు వితరణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం పురోహితులు మోహన్ జ్యోషి, రమేష్ జోషిలు పూజా కార్యక్రమాలు నిర్వహించి, బోరు మోటారును ప్రారంభించారు. ఆలయంలో బోరు బావికి మోటార్ సామాగ్రి అవసరం కావడంతో సేవా దృక్పథంతో వితరణ చేసినందుకు ఆలయ కమిటీ బాధ్యులు వీరయ్యను ఘనంగా సన్మానించారు. కాగా ఆలయ అభివృద్ధికి వెంకటేశం రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

అపరిచిత ఫోన్ కాల్స్‌పై అప్రమత్తత అవసరం


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

జహీరాబాద్: అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్, మెస్సేజ్‌లు వస్తుంటాయని వాటికి స్పందించరాదన్నారు. బ్యాంక్ వివరాలు, వ్యక్తి గత వివరాలను ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అంశాలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత జయంతి వేడుకలు


నారాయణఖేడ్: సామూహిక కుంకుమార్చన చేస్తున్న భక్తులు


అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి

నారాయణఖేడ్: వాసవీమాత జయంతి వేడుకలను నారాయణఖేడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ, పూజలు చేయడమే కాకుండా మహిళలు భారీ సంఖ్యలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. డోలాహరణం, వాసవి వ్రతాలు, లలిత సహస్ర పారాయణం తదితర కార్యక్రమాలను పురోహితులు మోహన్ జోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాత జీవిత వృత్తాంతాన్ని వివరించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ఒడి బియ్యం సమర్పించి, మంగళ హారతి నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహా ప్రసాదాన్ని అందించారు. కాగా పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ రావి ఆకుపై రూపొందించిన వాసవి మాత చిత్రాన్ని ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆవిష్కరించారు.

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీ వాసవీమాత జయంతిని ఘనంగా నిర్వహించారు. వాసవీ కల్యాణ మండపం వద్ద ప్రత్యేక వాహనంలో వాసవీమాత విగ్రహ ప్రతిమలను ఏర్పాటు చేసి ఆ వాహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రంగ సురేశ్ పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు జూకంటి లక్ష్మణ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు మన్‌సాన్‌పల్లి మల్లికార్జున్, బస్వ సత్యప్రకాశ్, ప్రసాద్, గజ్వాడ రాజు, పురం లక్ష్మణ్, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, పోల రఘు, మురళీ, మహిళా ఆర్యవైశ్య సంఘం సభ్యులు పద్మ, చందన, జీ.మంజుల, అనిత, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్: ఆర్యవైశ్యుల కుల దైవమైన సంగారెడ్డి పట్టణ శివారులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బుధవారం అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో ఐబీ నుంచి అమ్మవారి దేవాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆలయంలో వాసవీ అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,మహిళలు,ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400